క్లుప్తంగా

ఫ్యాక్టరీ కోసం నేడు స్థల పరిశీలన

కొడంగల్: నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో ఫ్యాక్టరీ నిర్మాణం కోసం శనివారం ఉదయం పరిశ్రమల శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలిస్తారు. ఫ్యాక్టరీ నిర్మిస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కొత్తపల్లి, బొంరాస్‌పేట మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ సీనియర్ నేతకు సన్మానం


రాములును సన్మానిస్తున్న శాంతిల్

కొడంగల్ : పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కరెంటు రాములును ఆ పార్టీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన విస్తారక్ శాంతిల్ సన్మానించారు. తొలి నుంచి సిద్ధాంతాలకు కట్టుబడి బీజేపీలోనే కొనసాగుతున్న కరెంటు రాములును అభినందించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తమిళనాడుకు చెందిన పార్టీ విస్తారక్ కొడంగల్‌లో పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, తొమ్మిదేళ్ల సేవా సుపరిపాలన గురించి ప్రజలకు వివరించారు. పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: నిరుపేద కుటుంబాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని కల్మన్‌కాల్వ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం కల్మన్‌కాల్వ గ్రామంలో ఈడిగి చిన్న బాలయ్య అనే వ్యక్తి మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నేతలతో బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు అంజనేయులు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన


గోధుమగూడలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అనంతగిరి: ప్రభుత్వం బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల గుర్తింపు కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వికారాబాద్ మండలంలోని గోధుమగుడ గ్రామంలో ఎంపీడీవో సత్తయ్య, నాగరాజు దరఖాస్తు చేసుకున్న బీసీ కులాల కులవృత్తి దుకాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో గోరింటాకు వేడుకలు


గోరింటాకుతో చేతులను అలంకరించుకున్న చిన్నారులు

పరిగి : పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థులు గోరింటాకు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు కె. మల్లేశ్ మాట్లాడుతూ.. గోరింటాకు ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని, ఈ గోరింటాకును ఆషాఢమాసంలోనే కాకుండా సంవత్సరం మొత్తం ధరించవచ్చని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల ఆకృతులలో చేతులని అలంకరించుకున్నారు.

చినుకు రాలక.. విత్తు మొలవక


ఎన్కేపల్లిలో మొలకలు రాని పత్తి పొలం

- వరుణుడి కోసం రైతన్న ఎదురుచూపు
- భూమిలోనే విత్తుతో తిప్పలు

మోమిన్‌పేట: వానాకాలంలోనూ భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. ఆరుద్ర కార్తె ప్రారంభమై ఎనిమిది రోజులు గడుస్తున్నా వరుణుడి జాడ కానరావడంలేదు. ఇప్పటికే కొద్ది పాటి వర్షాలకు రైతులు పత్తిని విత్తుకొన్నారు. వర్షం కురిపించాలని వరుణదేవున్ని రైతులు కోరుతున్నారు. రైతులు పత్తి విత్తనాలను మృగశిర కార్తె ప్రారంభంలోనే విత్తుకొన్నారు. కానీ విత్తుకొన్నది మొదలు చినుకుపడితే ఒట్టు. ఎండలు మాత్రం దంచి కొడుతున్నాయి. మళ్లీ వారం క్రితం కొద్దిగా వర్షం కురవడంతో మొలకలు రాని చోట విత్తనాలను విత్తుకుని వరుణుడి కోసం వేచిచూస్తున్నారు. జనవరిలో పత్తి తీసిన తర్వాత దుక్కులను దున్నుకొన్నారు. మార్చిలో కురిసిన వర్షాలకు గడ్డి మొలకలు రావడంతో మళ్లీ దున్నారు. తిరిగి ఏప్రిల్‌లో మళ్లీ వర్షాలు కురిసాయి. మళ్లీ గడ్డి మొలకలు వచ్చాయి. చేసేది లేక మే నెలలో దుక్కులు దున్నుకొని విత్తనాలు విత్తుకొనేందుకు సిద్ధం చేశారు. ప్రతి సంవత్సరం ఒక సారి దుక్కి దున్ని విత్తనాలు విత్తుకొనేందుకు దుక్కిని తయారు చేసేవారు. దీంతో ఎకరాకు రూ.2500 ఖర్చు అయ్యేది. ప్రస్తుత సంవత్సరం ఎకరాకు రూ.6వేల ఖర్చు అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో పాటు విత్తనాలు కూడా రెండు సార్లు పెట్టాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టరు, విత్తనాలు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ ఇంకా నాలుగు రోజులు అయితే కాని రుతు పవనాలలో కదలికలు ఉండవని పేర్కొంటుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

భూమిలోనే విత్తనాలు..



వర్షాలు కొంత మేర కురవడంతో 8 ప్యాకెట్ల పత్తి విత్తనాలను విత్తుకొన్నా. ఇప్పటి వరకు చినుకుపడితే ఒట్టు. వారం రోజుల క్రితం కొద్ది పాటి వర్షం పడింది. కొన్ని మొలకలు వచ్చాయి. వరుణుడు మొఖం చాటేయడంతో భూమిలోనే విత్తనాలు ఉండిపోయాయి. ఎదురు చూపులు తప్ప ఏమీ చేయలేని దుస్థితి. మళ్లీ విత్తుకొవాలంటే విత్తనాలు కావాలి. మూడు సార్లు దుక్కులను దున్నుకోవడంతో ట్రాక్టరు కిరాయి ఖర్చులు పెరిగాయి.

–రైతు అడివిరెడ్డి, ఎన్కేపల్లి

సగం మొలకలే వచ్చాయి..



ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని 10 పాకెట్ల పత్తి విత్తనాలను విత్తుకొన్నా. ఎండలు దంచి కొడుతుండటంతో మొలకలు రాలేదు. వారం రోజుల క్రితం కొద్ది పాటి వర్షం కరవడంతో సగం మొలకలు వచ్చాయి. మళ్లీ విత్తుకొన్నా. వర్షాల కోసం వేచి చూస్తున్నాం. పెట్టుబడులు పెరుగుతున్నాయి.

– రైతు పల్లే అనందం, ఎన్కేపల్లి

అందని ఆసరా పింఛన్లు

- ఆందోళనలో అభాగ్యులు
- పోస్టాఫీస్ దగ్గర పడిగాపులు



కొడంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆసరా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఆసరా ఫింఛన్లను ప్రతి నెలా ఒకటో తేదిన ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే కొంత కాలంగా ఆసరా పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. మే నెలకు సంబంధించిన పెన్షన్లు జూన్ నెలలో పంపిణీ చేయాల్సి ఉంది. జూన్ నెల దాటి జూలై మాసం వచ్చేసింది. అయినా పంపిణీ జరగలేదు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,016 ఇస్తున్నారు. దివ్యాంగులకు నెలకు రూ.3016 ఇస్తున్నారు. దివ్యాంగులకు అదనంగా వెయ్యి రూపాయలు పెంచడంతో ప్రతి నెలా రూ.4016 ఇవ్వాల్సి ఉంది. సకాలంలో పింఛన్లు రాక అభాగ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు పోస్టు ఆఫీసుల చుట్టూ తిరిగి అలసి పోతున్నారు.

ఇబ్బందిగా ఉంది

ప్రభుత్వం ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు ఇవ్వాలి. మధ్య మధ్యలో ఒక్కో నెల ఇవ్వడం లేదు. మే నెల పెన్షన్ ఇప్పటి వరకు అందలేదు. పెన్షన్ తీసుకోడానికి పోస్టాఫీస్‌కు వెళ్తే డబ్బులు లేవని తిప్పి పంపించారు. ఆసరా పింఛన్ల మీద ఆధారపడి బతుకుతున్న మాలాంటి అభాగ్యులు ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. కష్టంగా ఉంది.

– లక్ష్మమ్మ, కొడంగల్

సమస్యల పరిష్కారానికి కృషి


జేసీబీతో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న చైర్మన్ అశోక్

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్

పరిగి: మున్సిపాలిటీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 10వ వార్డు శ్రీనివాస కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో శుక్రవారం కాలనీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

- 3న కలెక్టరేట్ ఎదుట నిరసన
- వడ్డెరులంతా తరలిరావాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పరిగి: వడ్డెరులు ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని, ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలో శుక్రవారం వడ్డెర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్‌తో జూలై 3న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామన్నారు. వడ్డెరులంతా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తేనే మన హక్కులను సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మణి, మండల అధ్యక్షుడు అంజి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి పోటీలు

బంట్వారం: రాష్ట్ర క్రీడా పాఠశాలలో నాలుగు, ఐదు తరగతిలో ప్రవేశానికి మండల స్థాయిలో బాల బాలికలకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రప్ప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 3న, జెడ్పీహెచ్‌ఎస్ కోట్‌పల్లి ,4న జెడ్పీహెచ్‌ఎస్ బంట్వారంలో పోటీలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి దగ్గరలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు 13, 14 తేదీల్లో జిల్లా స్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు 28, 29 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సిఉంటుందని ఆయన వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు పీడీ కోట్‌పల్లి 98493 15184 , పీడీ బంట్వారం 89789 58609 నంబర్లను సంప్రదించాలన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

మర్పల్లి: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, విధుల్లో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని వెనుక బడిన తరగతులు సహాయ సంక్షేమ జిల్లా అధికారి బీమ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురం బీసీ బాలుర వసతి గృహంలో వర్కర్లుగా విధులు నిర్వహించిన అంజమ్మ, కామటి మొగులయ్య, ఎస్సీ బాలికల వసతి గృహంలో విధులు నిర్వహించిన బషీరొద్దీన్‌లు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

సాయిచంద్‌కు ఘన నివాళి


మర్పల్లిలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న నాయకులు

మర్పల్లి: ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతి సమాజానికి తీరనిలోటు అని మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట యువజన సంఘం నేతలు, బీఆర్‌ఎస్ యువజన సంఘం నాయకులు సాయిచంద్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఆయన పాడిన పాటలు మరువ లేనివన్నారు.

పోడుపట్టాలివ్వండి


వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అనంతగిరి: ఫారెస్ట్ భూముల్లో ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే పోడుపట్టాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిరిజన రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారూరు మండలంలోని పీసీఎం తండా పరిధిలో నివసిస్తున్న గిరిజనులు ఏళ్ల తరబడి భూములు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా రెవెన్యూ ఫారెస్ట్ అధికారుల జాయింట్ సర్వే చేసి పట్టాలిస్తామని చెప్పారన్నారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవచూపి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేగ నియంత్రణకు చర్యలు


గౌతాపూర్ వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన డ్రమ్ములు

ప్రమాదాల నివారణే ముఖ్యం

తాండూరు రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కరన్‌కోట్ పోలీసులు వినూత్న ప్రయోగం చేపట్టారు. ముఖ్యంగా గౌతాపూర్ నుంచి అల్లాపూర్ వరకు తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేశారు. గౌతపూర్‌లోని పాఠశాల వద్ద, చెంగోల్ చౌరస్తా, మాజీ ఎంపీటీసీ నాగప్ప ఇంటి వద్ద వేగ నియంత్రణకు డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ డ్రమ్ములను రాత్రి వేళ కనిపించేందుకు రేడియం స్టిక్కర్లు అతికించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


జీవీఎస్ నాయకులను ముందుస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పరిగి: ఉద్యమాలతో తెచ్చుకున్న తెలంగాణలో సమస్యల పరిష్కారం కోసం అడిగే హక్కు లేకుండా పోయిందని గిరిజన విద్యార్థి సంఘం (జీవీఎస్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. ప్రగతి భవన్‌కి వెళ్లకుండా జీవీఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టులు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమాలు, అవినీతికి పాల్పడిన హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించుకోవడం తప్పా అని ప్రశ్నించారు. అక్రమ ఆస్తుల కేసులో ఉన్న శ్రీనివాస్ హెల్త్ డైరెక్టర్‌గా నియమించడం ఎంత వరకు సమంజసమన్నారు. నిరసనలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టులు చేసి ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షుడు అనిల్, గణేష్, అంబర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి బీమ్‌రావు

మర్పల్లి: వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వెనుకబడిన తరగతులు సహాయ సంక్షేమ జిల్లా అధికారి బీమ్‌రావు వార్డెన్ ఉపేందర్‌కు ఆదేశించారు. శుక్రవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు వసతి గృహంలో ఉన్న పలు రిజిష్టర్లను పరిశీలించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ పాలనతో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలను శుక్రవారం పట్టణంలో ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో వ్యాపారులకు, ప్రజలకు కరపత్రాలను అందించారు. అనంతరం రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు తదితరులున్నారు.

గురుకులంలో 'వాయిస్ ఫర్ గర్ల్స్'


క్యాంపు లో విద్యార్థినులు


వాయిస్ ఫర్ గర్ల్స్ ఆకారంలో విద్యార్థినులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ సఖి క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు పది రోజులుగా ఇక్కడ కొనసాగుతుంది. ఆమనగల్, కోకట్, బంటారం, చేవెళ్ల, మోమిన్ పేట , మహేశ్వరం, కొత్తగడి గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించడంపై పది రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపు శుక్రవారం ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో కొత్తగడి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో బాలికలు అబ్బాయిలకు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. బాలికలకు, బాలురకు సమానంగా తల్లిదండ్రుల సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుష్క బిశ్వాస్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఆకాంక్ష జైన్, కౌన్సిలర్లు స్వర్ణాలి రాయ్, అతిథి యాదవ్, శ్రీజ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టని సర్కార్


మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

ధారూరు: రాష్ట్ర సర్కార్‌కు రైతుల సంక్షేమం పట్టడం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పీసీఎంతండా, గురుదోట్ల గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో 100 మంది చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా సతాయిస్తున్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. రుణమాఫీ కాక, రుణాలు రాక రైతులు ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రుణమాఫీ చేసే ఉద్దేశం లేదన్నారు. వ్యవసాయ సబ్సిడీలు ఎక్కడున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వంలోని పెద్దలంతా అభివృద్ధిని విస్మరించి అడ్డదారి సంపాదనలో నిమగ్నమయ్యారని విమర్శించారు. కేసీఆర్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. ప్రజలు ఆలోచించి చెయ్యి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, కాంగ్రెస్ నాయకులు గడిల మల్‌రెడ్డి, రమేశ్‌కృష్ణ, చంద్రయ్య, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.